క్లుప్తంగా

గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



బొబ్బిల్లంక ఇటుక బట్టీల వద్ద పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ఏవీకె చైతన్య ఆధ్వర్యంలో గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నారు. శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు వంటి హైరిస్క్ ఏరియాల వద్ద పని చేస్తున్న వారి కుటుంబాలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకొని గర్భిణులు, చిన్నారులను గుర్తించి వారికి టీకాలు వేయాలన్నారు. బొబ్బిల్లంక గ్రామం శివారున ఉన్న ఇటుకల బట్టీల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, ఏఎన్ఎంఎం దేవి, ఆశావర్కరు సీహెచ్ వీరలక్ష్మి పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

రాజానగరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ప్రమాదాలలో మృతి చెందిన జనసేన పార్టీకి చెందిన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు బీమా సహాయాన్ని రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ శనివారం అందజేశారు. స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 21 మందికి ఒక్కొక్కరికీ రూ.ఐదు లక్షలు చొప్పున ఈ సహాయానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజలంతా మెచ్చడం వల్లనే గతంలో 60 వేలు ఉన్న పార్టీ సభ్యత్వాలు నేడు 14 లక్షల వరకు నమోదయ్యాయన్నారు. మరో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే దిశగా పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నాయకులు బొలిశెట్టి చంద్రశేఖర్, గంటా స్వరూప, కడాలి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

బిక్కవోలు: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన త్రిపురాని స్వాతికి అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంతో వివాహమై 13 ఏళ్లు అయ్యిందన్నారు. వివాహిత భర్త సుబ్రహ్మణ్యంతో పాటు ఆమె అత్తమామలు సైతం అదనపు కట్నం కోసం ఇటీవల తరచూ వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని తెలిపారు.

3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



గోదావరిలంకల్లో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ పి.హనుశ్రీ ఆధ్వర్యంలో గోంగూరలంక, పిచ్చుకలంక, జౌరంగ్‌బాద్ గోదావరిలంకల్లో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 18 డ్రమ్ముల్లో ఉన్న 3,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సై ఎ.రామాంజనేయ, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రేషన్ కార్డులు సర్దుబాటు వలన ఏర్పడిన ఖాళీల భర్తీకి చౌకధరల దుకాణాల శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకం చేపడుతున్నట్టు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డీలరు రాజీనామా చేయడం, కొంత మంది మృతి చెందడం వల్ల గుర్తించిన ఖాళీలు, రేషన్ కార్డుల సర్దుబాటు వలను కొన్ని చోట్ల కొత్తగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతందున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందుపరచిన నిబంధనలకు లోబడి తమ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో గానీ, రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి(సబ్ కలక్టరు) కార్యాలయంలో నేరుగా జనవరి 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలన్నారు. దరఖాస్తులు తహసీల్దార్ , సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో పొందవచ్చున్నారు.

మూగ వేదన

- చర్మవ్యాధితో ఉన్న వీధి కుక్కలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



గ్రామాలలో తిరుగాడుతున్న డెర్మటైటిస్ వ్యాది సోకిన కుక్కలు

సీతానగరం: వీధి కుక్కలు చర్మవ్యాధిలతో బాధపడుతున్నాయి. ఈ చర్మ వ్యాధి పశువులకు, మనుషులకు సోకే అవకాశం ఉంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వీటిని తాకినా, ఇవి కాటు వేసినా ప్రాణానికే ప్రమాదమని చెబుతున్నారు. కుక్కలకు సోకిన చర్మ వ్యాధిని డెర్మటైటిస్ అని అంటారు. ఈ వ్యాధి సోకిన కుక్కలకు చర్మంపై వెంట్రుకలు ఊడిపోయి పొక్కులు వచ్చి చూడడానికే భయం కనిపిస్తాయి. చర్మమందంగా తయారవుతుంది. ఇది అంటు వ్యాధి. ఇటువంటి కుక్కల వలన రాబిస్ వ్యాధి సోకే అవకాశం ఉంది.

ఇది అంటు వ్యాధి

ఈ డెర్మటైటిస్ సోకిన కుక్కలు మనుషులకు తగిలినా, పశువులకు తగిలినా తొందరిగా వ్యాప్తి చెందుతుంది. మనుషులకు చర్మంపై ఉన్న వెంట్రుకలు రాలిపోయి, మచ్చలు ఏర్పడి, చర్మం మదంగా మారుతుంది. పశువులకు అయితే మచ్చలు ఏర్పడతాయి. రాబిస్ సోకిన కుక్కలు కరిచిన పశువులకు ఆ వ్యాధి సోకే అవకాశం ఉంది. జంతువుల్లో చొంగకార్చడం, డొక్కలు లోపలికి నొక్కుకున్నట్టు ఉండడం, మేత తీసుకోకపోవడం వంటివి కనిపిస్తాయి. వారం రోజుల్లో పశువులు చనిపోతాయి. మనుషుల్లో కూడా అంతే జరుగుతుంది.

అధిక సంఖ్యలో..

నియోజకవర్గ గ్రామాల్లో ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో చర్మవ్యాధితో ఉన్న కుక్కలే కనిపిస్తున్నాయి. కుక్కలకు వేసే వ్యాక్సిన్ వేయకపోవడంతో ఈ వ్యాధి వ్యాప్తి చెందినట్టు వైద్యులు చెబుతున్నారు. మున్సిపాలిటి, కార్పొరేషన్‌లల్లోను కుక్కలకు గర్భనిరోధక ఆపరేషన్లు చేస్తున్నారు. కాని గ్రామాల్లో మాత్రం ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. రోజుకు స్థానిక పీహెచ్‌సీలకు పలువురు రాబిస్ వ్యాక్సిన్ వేయించుకుంటునే ఉన్నారు. చర్మవ్యాధులతో బాధపడే కుక్కల సంఖ్య అత్యధికంగానే ఉంది. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడ చూసినా వ్యాధి సోకిన శునకాలే



నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. సీతానగరంలో మా బంధువులు ఉన్నారు. వాళ్ల ఇంటికి వచ్చినప్పుడు కుక్కలను చూశాను. ఎక్కువగా చర్మ వాధ్యులతో బాధపడుతున్నాయి. ఇటువంటివి ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్నాయి. అవి చాలా వికృతంగా ఉంటున్నాయి. ఈ వ్యాధులు మనుషులకు కూడా సోకుతున్నాయి. సంబంధిత శాఖాధికారులు వీటిపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలి. లేకుంటే పెద్ద నష్టమే జరుగుతుంది.

– ప్రత్తి చంద్రశేఖర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, హైదరాబాద్

అప్రమత్తంగా ఉండాలి



డెర్మటైటిస్ వ్యాధితో ఉన్న కుక్కలతో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇవి వికృతంగా, వెంట్రుకలు రాలిపోయి ఉంటాయి. కొన్ని కుక్కలు తిండి తినక, సొంగ కార్చుతూ ఉంటాయి. కుక్కలకు రాబిస్ ఉంటే అవకాశం ఉంది. వీటి వలన ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. డెర్మటైటిస్ సోకిన కుక్కలకు తగిలితే ఆ వ్యాధి మనుషులకు సోకుతుంది. అలాగే పశువులకు కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ కుక్కలతో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి

– ఎ ఫణీంద్ర, పశువైద్యులు, చినకొండేపూడి

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రాచీన ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస త్రయోదశి సందర్భంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామికి పంచామృతాభిషేకం, తులసి పూజ చేశారు. గోదమ్మవారికి శ్రీ చూర్ణం పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రతన్ టాటాకు విద్యార్థుల నివాళి



రతన్ టాటా పేరుతో కూడిన ఇంగ్లిష్ అక్షరాలలో ఆశీనులైన విద్యార్థులు

రాజానగరం: ప్రముఖ్య వ్యాపారవేత్త, దివంగత రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని స్థానిక దివ్య విద్యా సంస్థల విద్యార్థులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. స్కూలు ఆవరణలో సుమారు 300 మంది విద్యార్థులు రతన్ టాటా పేరుతో కూడిన ఇంగ్లిష్ అక్షరాలలో ఆశీనులైన నివాళులర్పిస్తు ఆయనపై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. వ్యాపారవేత్తగా తన వ్యాపార సామ్రాజ్యన్ని విస్తరించుకుంటూనే దేశాభివృద్ధికి తోర్పడటమే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలు వంటి ఉపద్రవాలు సంభవించిన సమయంలో తానున్నానంటూ మానవతావాదిగా స్పందించిన తీరు ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని విద్యా సంస్థల వైస్‌చైర్మన్ బర్ల విజయ్ పేర్కొన్నారు.

నిరంతర సేవలతోనే సంతృప్తి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

పెదపూడి: నిరంతర సేవా కార్యక్రమాలు చేపట్టడమే సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ దాత్రి లక్ష్యమని ట్రస్ట్ ప్రెసిడెంట్, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, బుక్స్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ డెంగీతో మరణించిన తన కుమారుడి పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎంతో కొంత పేదలకు సాయం అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఏడాది తన కుమారుడు సురేష్‌రెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా ఇప్పటి వరకు 600 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదన్నారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకొని పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సురకాసుల శివ, వైఎస్సార్ సీపీ మండల అధికారి ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గంగరాజు, ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ పులగం శివారెడ్డి, కార్యదర్శి చింతా ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ మల్లిడి శివకుమార్‌రెడ్డి, సభ్యులు ఎస్.సత్యజగదీష్, కర్రి సతీష్‌రెడ్డి, నల్లమిల్లి శివసాయినాథ్‌రెడ్డి, కర్రి తేజా పవన్, మణికంఠరెడ్డి, కర్రి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ డెంటల్ కాలేజీలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజానగరం: బీడీఎస్ కోర్సును పూర్తిగా పునర్నిర్వచించవలసిన అవసరం ఉందని కెమిస్ట్రీ టీచర్, తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు అన్నారు. స్థానిక జీఎస్ఎల్ డెంటల్ కాలేజీలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పుచ్చిపోయిన పండ్లను పీకడంతో ప్రారంభమైన దంత వైద్యం నేడు శాఖోపశాఖలుగా విస్తరించి, కాస్మోటిక్ సర్జరీల వరకూ అభివృద్ధి చెందిందన్నారు. ఈఎన్‌టీ చదివిన డాక్టర్లకు సూపర్ స్పెషాలిటీ విభాగమైన ఆంకాలజీ హెడ్ అండ్ నెక్ సర్జరీ చదువుకోడానికి అనుమతించినట్లే బీడీఎస్ కోర్సును కూడా ఇతర మెడికల్ సూపర్ స్పెషాలిటీ, సబ్ స్పెషాలిటీ కోర్సులకు అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై గ్రామోత్సవం



అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం సుప్రభాతసేవ, లఘు అర్చన, తోమాల సేవ, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపుసేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామి వారిని అశ్వవాహనంపై గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు



సైన్స్ ఫెయిర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల నుంచి వ్యక్తిగత, గ్రూప్, టీచర్ కేటగిరీల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొబ్బిలంక, మిర్తిపాడు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంలు కోలా సత్యనారాయణ, త్రినాథ్‌రావు హాజరై విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. వ్యాఖ్యాతగా కె సతీష్ బాబు వ్యవహరించగా మోహన్‌రావు, ఝాన్సీ, శేఖర్‌లు జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో రఘుదేవపురానికి చెందిన టీచర్ కేటగిరిలో జి.శేఖర్ (రఘుదేవపురం), వ్యక్తిగత విభాగంలో గీతా సాయి ప్రభు, గ్రూప్ స్టూడెంట్స్ విభాగంలో ప్రసాద్, మూర్తి (బొబ్బిల్లంక) గెలుపొందారు. ఈ కార్యక్రమంలో జీవీవీ సత్యనారాయణ, అద్దేపల్లి సత్యనారాయణ, మోహన్, పోసియ్య, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చివరికి మిగిలింది నిరాశే..

- నిలిచిన ధాన్యం కొనుగోళ్లు
- ఆందోళలో అన్నదాత



బూరుగుపూడిలో వేసిన వరి కుప్ప

మధురపూడి: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చివరకు అక్కరకు రాకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. వాతావరణంతోపాటు, ప్రభుత్వ విధానాలు కూడా రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అప్పు చేసి పండించిన పంటను ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు వాటిని నిలిపివేసింది. దీంతో రైతులకు నిరాశే మిగిలింది. ఖరీఫ్ సీజన్‌లో మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలో 5,199 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేయగా 31 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం చేతికందింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోల్లు ప్రారంభించింది. అయితే కేవలం 12,784 టన్నులు మాత్రమే కొనింది. దీంతో మిగిలిన పంటను ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 24 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారు. కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సాయిరాం



రంగంపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన సాయిరాంను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రంగంపేట: మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మైలవరపు సాయిరాం రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఆర్య, వైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఆర్‌ఓగా రాజమహేంద్రవరానికి చెందిన రజిని, ఏఆర్‌ఓగా మండవిల్లి గుప్తా వ్యవహరించారు. అనపర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శివరామరాజు, రంగంపేట మండల బీజేపీ నాయకులు మాణిక్యం, పోతుల వీర సుందరరావు, పేపకాయల రామచంద్రరావు, కొండేపూడి ధనరాజు సమక్షంలో సాయిరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సూరిబాబు, సురేష్, వెంకన్న పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే ప్రగతి



బలభద్రపురంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ

బిక్కవోలు: ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమదృష్టితో చూడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం బలభద్రపురం గ్రామంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బేటి బచావో..బేటీ పడావో' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా ప్రజలకు మరింత సేవలు అందించాలన్నారు. బాలికా విద్యతోనే ప్రగతి సాధ్యమన్నారు. కార్యక్రమంపై విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతుల అందించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ రంగంపేట ప్రాజెక్ట్ సీడీపీవో జెస్సీ ఫోరెన్స్, సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి, ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పడాల రామారెడ్డి, మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, మహిళా నాయకురాలు యామాల చిన్నమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా వికాసంతోనే ప్రగతి

పెదపూడి: మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై ప్రభుత్వ శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ బాలికా వికాసంతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. ఆడపిల్లలను స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎదగనీయాలని సూచించారు. సీడీపీఓ అనసూరి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీపద్మ, శ్రీగౌరీ, ఈఓపీఆర్డీ, చైల్డ్ అభ్యుజ్జ్ కమిటీ చైర్మన్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ-1,2లు కె.సత్యనారాయణ, సీవీవీ.సత్యనారాయణ, వెలుగు ఏపీఎం వి.అరుణ, వైద్యులు శిరీష, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణల పితామహుడు మన్మోహన్‌సింగ్

నివాళులర్పించిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉండవల్లి అరుణ్‌కుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉన్న దశలో భారత్‌దేశాన్ని సంస్కరణ బాట పట్టించిన నాయకుడు మన్మోహన్‌సింగ్ అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కొనియాడారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రకాష్‌నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొద్దిసేపు మౌనం వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ప్రధానిగా ఉన్నప్పుడు సలహాదరుడిగా ఉన్న మన్మోహన్ సింగ్‌నీ తరువాత ప్రధాని పీవీ నరసింహరావు ఆర్థిక మంత్రిని చేశారు. ఆయన ప్రతి నెలా ప్రెస్‌మీట్ నిర్వహించేవారు. మన్మోహన్ సింగ్ ఎవ్వరూ చెప్పినా వింటారని, వినడం అన్నది ఆయన దగ్గర చూసి నేర్చుకోవాలన్నారు. నోరు ఎత్తని వాడు, నోట్లో నాలుక లేని వాడు ప్రధాని అవ్వడం సాధారణమైన విషయం కాదన్నారు. మన్మోహన్ సింగ్ దేశానికి అవసరమని సోనియా గాంధీ ప్రధానిగా మన్మోహన్ సింగ్‌ని చేశారన్నారు. ఆయన తీసుకువచ్చిన ఆర్టీఐ చట్టం వల్ల అనేక కుంభకోణాలు బహిర్గతమవుతున్నాయన్నారు. డిమానిటైజేషన్ ద్వారా దేశ జీడీపీ 2 శాతం పడిపోతుందని మన్మోహన్ సింగ్ ఊహించి చెప్పినట్టుగానే డిమానిటైజేషన్ తరువాత జరిగిందన్నారు. ఆయన కమిట్మెంట్ ఉన్న వ్యక్తి అని, భారత్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నెహ్రూ తరువాత కొత్త ఆలోచనతో పాలన చేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని అన్నారు. భారత్ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిక్కించదగ్గ వ్యక్తి మన్మోహన్ సింగ్‌ని అన్నారు.

పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అర్జీలు నమోదు చేయాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎం.ఆలీలతో తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ద్వారా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న పౌరసేవల ప్రగతిపై సోమవారం అమరావతిలో నిర్వహించే ప్రాంతీయ సదస్సులో జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగని సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించనున్నారని తెలిపారు. ఇందులో ప్రజా సమస్యల పరిష్కార విధానం, నీటి పన్ను, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఇంటి స్థలాల స్థితి, గ్రామసభ ఫిర్యాదుల పరిష్కార స్థితి, సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు తదితర అంశాలపై సమీక్షిస్తారని వివరించారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయి పనితీరుపై సమీక్షించే అవకాశం ఉందని చెప్పారు. ఈ అంశాలపై నివేదికలతో క్షేత్ర స్థాయి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఆర్ఓను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.

విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: జిల్లా వినియోగదారుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే శనివారం తెలిపారు. తెలుగు వక్తృత్వ పోటీలో ఎం.శ్రావణి, ఇంగ్లీషులో టి.రేఖ, తెలుగు వ్యాచరచన విభాగంలో కె.రమ్య, ఇంగ్లీష్ విభాగంలో ఈవీడీ హారిక ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె.వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, కళాశాల వినియోగదారుల క్లబ్ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులను అభినందించారు.